ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
గురువారం 13 నవంబరు 2025



సెర్ప్ డైరెక్టర్‌గా డ్వామా పీడీ

శ్రీకాకుళం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పవర్టీ(ఎస్ఈఆర్‌పీ) డైరెక్టర్‌గా శ్రీకాకుళం డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ బి.సుధాకరరావు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులను జారీచేసింది. గతేడాది సెప్టెంబరులో జిల్లా డ్వామా పీడీగా సుధాకరరావు బాధ్యతలు చేపట్టారు. ఇప్పుడు రాష్ట్ర రాజధానిలో ఉండే సెర్ప్ కార్యాలయంలో డైరెక్టర్‌గా నియమితులయ్యారు. త్వరలో జిల్లాకు డ్వామా పీడీగా మరో అధికారిని ప్రభుత్వం నియమించనుంది.



ఎచ్చెర్ల: జరజాం సచివాలయం

ఇప్పుడే ఫీల్డ్‌కు వెళ్లారు

ఆంధ్రజ్యోతి ప్రత్యేకం

- ఇదీ గ్రామ, వార్డు సచివాలయాల్లో పరిస్థితి
- పూర్తిస్థాయిలో హాజరుకాని ఉద్యోగులు
- సమయపాలన పాటించడం అంతంతే
- కానరాని అధికారుల పర్యవేక్షణ
- పింఛన్ పంపిణీ సమయంలోనే హడావుడి
- జిల్లాలో సుమారు 700 పోస్టులు ఖాళీ

శ్రీకాకుళం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి)

సచివాలయాల్లో కొందరు ఉద్యోగుల తీరు విమర్శలకు తావిస్తోంది. సమయపాలన పాటించడం లేదు. ఏ రోజు కూడా పూర్తి స్థాయిలో సిబ్బంది హాజరైన దాఖలాలు లేవు. వారి కోసం ఎవరైనా అడిగితే ఇప్పుడే ఫీల్డ్‌కు వెళ్లారు అని మిగతా సిబ్బంది సమాధానం చెప్పడం కనిపిస్తుంది. ప్రజాప్రతినిధులు, అధికారులు పూర్తిస్థాయి దృష్టిసారించక పోవడంతో సచివాలయ సిబ్బంది ఆడిందే ఆట.. పాడిందే పాటగా పరిస్థితి మారింది. వారిని గాడినపెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జిల్లా వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల పని తీరు.. ప్రజలకు అందుతున్న సేవలు.. సిబ్బంది సమస్యలపై 'ఆంధ్రజ్యోతి' సోమవారం విజిట్ నిర్వహించింది. ఈ పరిశీలనలో పలు విషయాలు వెలుగుచూశాయి.


టెక్కలిలో సోమవారం ఉదయం 11.20 గంటలైనా తెరుచుకోని చేరివీధి-4 సచివాలయం

ఎవరి ఇష్టం వారిదే..

టెక్కలి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): టెక్కలి మేజర్‌పంచాయతీ నాల్గవ సచివాలయం(చేరివీధి) సిబ్బంది సమయపాలన పాటించలేదు. సోమవారం ఉదయం 11.20 గంటలకు సచివాలయాన్ని తెరిచారు. కొంతమంది మాత్రమే అందుబాటులో ఉన్నారు. సర్వేలు, ఇతర పనుల నిమిత్తం బయట తిరుగుతున్నామని కొంతమంది సిబ్బంది చెప్పారు. కానీ, బయటకు ఎందుకు వెళ్లారో మూమెంట్ రిజిస్టర్‌లో వివరాలు నమోదు చేయలేదు. వార్డు హెల్త్ సెక్రటరీ(ఏఎన్‌ఎం) వై.రవణమ్మ ఉదయం 10.47గంటలకు వచ్చి.. కార్యాలయంలోకి రాకుండానే 10.51 గంటలకు బయటకు వెళ్లిపోయారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఎన్.విజయచంద్ర 11.21 గంటలకు, డిజిటల్ అసిస్టెంట్ కె.రవికుమార్ 11.23 గంటలకు, వెల్ఫేర్ అసిస్టెంట్ ఈశ్వరరావు 11.58గంటలకు వచ్చారు. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ మీనాక్షి సెలవు. విలేజ్ సర్వేయర్ ఆర్.పోలీస్, వీఆర్వో చత్రపతి డిప్యుటేషన్. మహిళా పోలీస్ నాగరత్నం రావివలస ఎండలమల్లన్న ఆలయంలో విధులు నిర్వర్తించారు.

జిల్లాలో పరిస్థితి..

జిల్లాలో 732 సచివాలయాలు ఉన్నాయి. ఇందులో 75 వార్డు, 657 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. కొద్దినెలల కిందట ప్రభుత్వం రేషనలైజేషన్ నిర్వహించి సచివాలయ సిబ్బందికి ఉద్యోగోన్నతులు కల్పించింది. జనాభా ప్రాతిపదికన సచివాలయాలు ప్రజలకు అందుబాటులో ఉండేలా నిర్ణయం తీసుకుంది. 732 సచివాలయాలకు మొత్తం 7,200 మంది సిబ్బంది ఉండాల్సి ఉంది. కానీ 6,416 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. 700పైబడి పోస్టులు ఖాళీగానే ఉన్నాయి.

- 'ఆంధ్రజ్యోతి' బృందం సోమవారం పలు సచివాలయాలను పరిశీలించింది. ఏ ఒక్క సచివాలయంలో కూడా పూర్తిస్థాయిలో సిబ్బంది విధులకు హాజరుకాలేదు. ఒకరు నుంచి ముగ్గురు వరకు మాత్రమే ఉన్నారు. మిగిలినవారు ఇప్పుడే ఫీల్డ్‌కు వెళ్లారంటూ సిబ్బంది బదులిస్తున్నారు. శ్రీకాకుళం (మిగతా 6వ పేజీలో..)


సూదికొండ సచివాలయంలో పనిచేస్తున్న టౌన్‌ప్లానింగ్ ఉద్యోగి, మిగిలిన సీట్లు ఖాళీగా ఉన్న దృశ్యం

ఉన్నది ముగ్గురే..

పలాస, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అక్కడ మొత్తం 5,600 మంది జనాభా. 1800 కుటుంబాలు. ఉన్నది ఒకటే సచివాలయం. అందులో ఉన్న సిబ్బంది కేవలం ముగ్గురు మాత్రమే. అందులో ఒకరు డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నారు. మరొకరికి మొత్తం మూడు బాధ్యతలు అప్పగించారు. ఇదీ పలాసలోని సూదికొండకాలనీ సచివాలయం పరిస్థితి. ఇక్కడ మొత్తం 16 మంది అవసరం కాగా.. 8 మందిని మాత్రమే నియమించారు. అందులో ప్రస్తుతం ముగ్గురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. శ్రీకాకుళం నుంచి కవిటి హర్ష అనే ఉద్యోగి డిప్యూటేషన్‌పై ఇక్కడకు వచ్చారు. టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఉద్యోగులు లేకపోవడంతో ఆ బాధ్యత ఆయనే చూస్తున్నారు. జి.విఘ్నేష్ అనే ఉద్యోగి అడ్మిన్‌గా పనిచేస్తున్నారు. ఉద్యోగులు లేకపోవడంతో అదనంగా ఎన్విరాల్‌మెంట్, వెల్ఫేర్ ఉద్యోగుల విధులు కూడా ఆయనే నిర్వహిస్తున్నారు. మహిళా పోలీసు ఒకరు ఉన్నారు. మిగిలిన వారంతా ఫీల్డ్ ఉద్యోగులు కావడంతో కార్యాలయం అంతా ఖాళీగా కనిపించింది. ఉన్న సిబ్బందిపై అదనపు పనిభారం పడుతుండడంతో సక్రమంగా సేవలు అందని దుస్థితి నెలకొంది.

దైవదర్శనానికి వెళ్లి.. తిరిగిరాని లోకాలకు

- అచ్చుతాపురం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- ఇద్దరు మహిళల దుర్మరణం ● 11 మందికి గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం ● గుర్రాలపాలెంలో విషాదం


అచ్చియ్యమ్మ (ఫైల్)


పద్మ (ఫైల్)


ప్రమాద దృశ్యం

జలుమూరు/లావేరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వారంతా ఒకే కుటుంబానికి చెందిన బంధువులు. అంతా కలిసి ఆటోలో దైవ దర్శనానికి బయలుదేరారు. తొలుత ఓ ఆలయానికి వెళ్లి పూజలు చేశారు. అక్కడ నుంచి మరో ఆలయానికి వెళ్తుండగా మార్గమధ్యలో ప్రమాదానికి గురయ్యారు. వారి ఆటోను ఎదురుగా వస్తున్న వ్యాన్ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మృతి చెందగా, 11 మందికి గాయాలయ్యాయి. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. లావేరు మండలం గుర్రాలపాలెంకు చెందిన గట్టెం అచ్చియ్యమ్మ (52) గట్టెం పద్మ (25)తో పాటు మరో 11 మంది బుధవారం ఉదయం 9 గంటలకు ఆటోలో టెక్కలి మండలం రావివలస వెళ్లి ఎండలమల్లన్నను దర్శించుకున్నారు. అనంతరం శ్రీముఖలింగేశ్వరస్వామి దర్శనానికి వెళ్తుండగా జలుమూరు మండలం అచ్యుతాపురం వద్ద ఎదురుగా వస్తున్న బొలేరా వ్యాను ఢీకొట్టడంతో ఆటో బోల్తాపడింది. ఈ ఘటనలో అచ్చియ్యమ్మ, పద్మ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనలో 8 మందికి తీవ్రగాయాలు కాగా, ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. వీరిలో సిర్ర ప్రకాష్ పరిస్థితి విషమంగా ఉంది. ఈ ప్రమాదంలో మూడేళ్ల పాప రుత్విక స్వల్ప గాయాలతో బయటపడింది. నరసన్నపేట సీఐ ఎం.శ్రీనివాసరావు, జలుమూరు ఎస్ఐ బి.అశోక్‌బాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించి క్షతగాత్రులను అచ్యుతాపురం పీహెచ్‌సీకి తరలించి వైద్యసేవలందించారు. అనంతరం మెరుగైన (మిగతా 7వ పేజీలో..)

క్షతగాత్రులు వీరే..

పెద్ది రుత్విక (3), పెద్ది అశ్విని (28) గట్టెం పద్మ (45), సిర్ర వరలక్ష్మి (30), సిర్ర ప్రకాష్ (40), బాద హేమలత (25), గట్టెం అప్పలనరసమ్మ (48), బాద మధుసూదన రావు, డ్రైవర్ (34), బాద రమణమ్మ (60), గట్టెం సుమతి (45) ఉన్నారు.

రోడ్లు ఛిద్రం

- మొంథా తుఫాన్‌తో దెబ్బతిన్న రహదారులు
- ఎక్కడికక్కడే గోతులు
- ప్రజలకు తప్పని ఇబ్బందులు
- బాగు చేయాలని అధికారులకు విన్నపం


పలాస: కోతకు గురైన రాజగోపాలపురం రహదారి


పాతపట్నంరూరల్: ఛిద్రమైన పాతపట్నం ఆల్‌ఆంధ్రా రోడ్డు

శ్రీకాకుళం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా జిల్లాలో పలుచోట్ల రహదారులు అధ్వానంగా మారాయి. కోతకు గురై.. గోతులమయమయ్యాయి. అనేక చోట్ల కల్వర్టులు కూడా కుంగిపోయాయి. వంతెనలు మరింత ప్రమాదకరంగా మారాయి. వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక గిరిజన రహదారుల పరిస్థితి సరేసరి. రాళ్లు తేలి దారుణంగా తయారయ్యాయి. దీంతో ప్రజల కష్టాలు రెట్టింపయ్యాయి. చాలాచోట్ల రాకపోకలు సాగించలేని పరిస్థితి ఏర్పడింది. విద్యార్థులు పాఠశాలలకు చేరుకోలేక పోతున్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి మొంథా తుఫాన్ ధాటికి ఛిద్రమైన రహదారులను బాగు చేయించాలని జిల్లావాసులు కోరుతున్నారు. మరిన్ని వివరాలు 6లో..

ఒడిశా టు తమిళనాడు

- 20.670 కేజీల గంజాయి రవాణా ● ఇద్దరి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ

ఇచ్ఛాపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి తమిళనాడుకు అక్రమంగా తరలిస్తున్న 20.670 కేజీల గంజాయిని పోలీసులు పట్టుకొని సీజ్ చేశారు. ఈ వివరాలను బుధవారం సర్కిల్ కార్యాలయంలో సీఐ మీసాల చిన్నమనాయుడు విలేకరులకు వెల్లడించారు. తమిళనాడు రాష్ట్రం తిరునవల్లి జిల్లా తుతుక్కుడి పట్టణానికి చెందిన వి.సతీష్‌కుమార్‌తో పాటు ఓ బాలుడు ఒడిశా రాష్ట్రం మోహన్ బ్లాక్ చంద్రగిరికి చెందిన ఇసాక్ బీర వద్ద 20.670కేజీల గంజాయిని కొనుగోలు చేశారు. తమిళనాడు రాష్ట్రం మెలపాలయం గ్రామానికి చెందిన గంజాయి వ్యాపారి హుస్సేన్ (అలియాస్ షౌఖక్ ఆలీ)కు (మిగతా 8వ పేజీలో..)

సొంతింటి కల నెరవేర్చుతాం

- గృహాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే గౌతు శిరీష


వార్డులో ఓ గృహాన్ని ప్రారంభిస్తున్న శిరీష

పలాస, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పేదల సొంత ఇంటి కలను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. బుధవారం స్థానిక 22, 27 వార్డుల్లో భూమి పూజ, గృహ ప్రవేశ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. జగనన్న లేఅవుట్లలో ఎక్కడా పూర్తిగా గృహాలు నిర్మించుకోలేకపోయారని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బీసీలకు రూ.50వేలు, ఎస్టీ, ఎస్సీలకు రూ.70వేలు అదనంగా ఇచ్చినట్లు చెప్పారు. పలాస నియోజకవర్గంలో 1508 ఇళ్లు ప్రారంభించామని, 1029 మందికి అదనంగా డబ్బులు ఇచ్చామని పేర్కొన్నారు. ఎన్టీఆర్ గృహ హక్కు పథకం కింద 3,844 గృహాలకు ఇప్పటికే వెరిఫికేషన్ జరిగిందని, వారికి తొందరలోనే డబ్బులు చెల్లిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు, సూర్యనారాయణ, సప్ప నవీన్, రవిశంకర్‌గుప్తా పాల్గొన్నారు.

ఉపాధి కోసం వెళ్లి విగతజీవిగా మారి

- మస్కట్‌లో జిల్లా యువతి ఆత్మహత్య ● నాలుగు నెలల కిందటే వెళ్లిన వైనం


నాగమణి (ఫైల్)

ఆమదాలవలస, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మస్కట్ దేశంలో జిల్లాకు చెందిన ఓ యువతి ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. నాలుగు నెలల కిందటే ఉపాధి కోసం మస్కట్ వెళ్లిన యువతి విగతజీవిగా మారడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఆమదాలవలస మండలం వెదుళ్లవలస గ్రామానికి చెందిన నవలాపురం నాగమణి (25) మస్కట్‌లో ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి సరోజని మాట్లాడుతూ.. తన కుమార్తె జీవనోపాధి కోసం మస్కట్ వెళ్లి నాలుగు సంవత్సరాల పాటు అక్కడే పనిచేసి ఇంటికి డబ్బులు పంపించేదని తెలిపారు. ఇటీవల మస్కట్ నుంచి ఇంటికి తిరిగి వచ్చిందన్నారు. మళ్లీ నాలుగు నెలల కిందట ఒక ఏజెంట్ ద్వారా మస్కట్‌కు వెళ్లిందన్నారు. మూడు రోజుల కిందట తన కుమార్తె ఫోన్ చేసి అక్కడ చాలా ఇబ్బంది పెడుతున్నారని,ఇంటికి తిరిగి వచ్చేస్తానని చెప్పిందన్నారు. కొద్దిసేపటి తర్వాత ఏజెంట్ ఫోన్ చేసి.. 'మీ అమ్మాయి ఆత్మహత్య చేసుకుంది.'అని తెలిపాడని, ఆ ఫోటోలు తనకు పంపించాలని కోరినా ఇవ్వలేదని తల్లి కన్నీరుమున్నీరవుతోంది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే కూన రవికుమార్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుతో మాట్లాడారు. స్వదేశానికి మృతదేహాన్ని రప్పించేందుకు చర్యలు చేపడుతున్నారు. తన కుమార్తె మరణానికి గల కారణాలపై దర్యాప్తు నిర్వహించి ఏమైందో బయటపెట్టాలని మృతురాలు తల్లి సరోజని రామ్మోహన్ నాయుడును కోరారు.

సామాజిక స్పృహతో రచనలు చేయాలి

- పౌరసరఫరాల శాఖ సంచాలకుడు రోణంకి

7లో


శ్రీకాంత్ బృందం నృత్య ప్రదర్శన

సన్న బియ్యం పేరిట మోసం

7లో

అమానుషం

- విద్యార్థిపై లైంగిక వేధింపులు

7లో

ఇళ్ల పండుగ

7లో

ఏమైందో?

- ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్ విద్యార్థి ఆత్మహత్య
- హాస్టల్ గదిలోనే ఫ్యాన్‌కు ఉరేసుకున్న వైనం
- మిడ్ పరీక్షలు జరుగుతుండగానే ఘటన
- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు


సృజన్ (ఫైల్)

ఎచ్చెర్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్ఎంపురం కొండపై ఉన్న ఆర్జీయూకేటీ, శ్రీకాకుళం క్యాంపస్ విద్యార్థి ప్రత్తిపాటి సృజన్ (20) బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఎచ్చెర్ల పోలీసులు, తోటి విద్యార్థులు వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా పాత గుంటూరు పట్టణంలో ఏటీ అగ్రహారం నాలుగో లైన్‌కు చెందిన సృజన్ 2021-22 విద్యా సంవత్సరంలో శ్రీకాకుళం క్యాంపస్‌లో చేరాడు. ప్రస్తుతం ఇంజనీరింగ్ ఈఈఈ బ్రాంచ్‌లో తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. గత రెండు రోజులుగా క్యాంపస్‌లో ఇంజనీరింగ్ విద్యార్థులకు షిఫ్టుల వారీగా మిడ్ ఎగ్జామ్స్ జరుగుతున్నాయి. బుధవారంతో ఈ పరీక్షలు ముగియనున్నాయి. తోటి విద్యార్థులంతా మిడ్ పరీక్షలు రాసేందుకు వెళ్లగా.. సృజన్ మాత్రం బాలుర హాస్టల్‌లో తాను ఉంటున్న నాలుగో అంతస్థు నుంచి మొదటి అంతస్థుకు దిగి తన స్నేహితుని గదిలో ఫ్యాన్‌కు తాడు బిగించి ఉరిపోసుకున్నాడు. ఉదయం 11 గంటల సమయంలో హాస్టల్ గదికి వచ్చి తోటి విద్యార్థులు చూసే సరికి తలుపులు మూసి ఉన్నాయి. దీంతో కిటికిలోంచి చూడగా సృజన్ ఫ్యాన్‌కు వేలాడి ఉన్నట్టు గుర్తించారు. ఈ విషయాన్ని క్యాంపస్ అధికారులకు చెప్పారు. వారు వచ్చి తలుపులు పగలుగొట్టి చూశారు. సృజన్‌ను క్యాంపస్‌కు చెందిన అంబులెన్స్‌లో శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఎస్ఐ వి.సందీప్‌కుమార్, పోలీసు సిబ్బంది సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పరీక్షలతో అంతా (మిగతా 8వ పేజీలో..)


విద్యార్థులు, అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు


కొట్టుకుపోయిన అడవికొత్తూరు రహదారి

రహదారులు ఛిద్రం

● మొంథా తుఫాన్‌తో దెబ్బతిన్న రోడ్లు ● ఎక్కడికక్కడే గోతులు
● వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ● బాగు చేయాలని విన్నపం

మొంథా తుఫాన్‌తో రహదారులకు తీవ్ర నష్టం కలిగింది. జిల్లాలో పలు పట్టణ, గ్రామీణ రోడ్లు దెబ్బతిన్నాయి. కొన్నిచోట్ల అడుగుకొక గొయ్యి దర్శనమిస్తోంది. వీటిల్లో నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. కొన్నిచోట్ల వాహనాల రాకపోకలకు కూడా ఇబ్బందిగా మారింది. రోడ్లపై వాహనాలు దిగబడిపోతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ రోడ్లను బాగు చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.


కోణంగి వద్ద కోతకు గురైన రోడ్డు

అడవికొత్తూరుకు దారేదీ..

పలాస, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని ఒకటో వార్డు అడవికొత్తూరు గ్రామ రోడ్డు మధ్యలో కొట్టుకుపోయింది. దీంతో ఆ గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం గ్రామస్థులు కోసంగిపురం గ్రామం మీదుగా జాతీయరహదారికి చేరుకొని అక్కడ నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. అడవికొత్తూరులో మొత్తం 50 పైగా గృహాలు ఉన్నాయి. పక్కా రహదారి నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గౌతు శిరీష తొందరలోనే గ్రామానికి రహదారి సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

కోతకు గురైన రోడ్డు..

పాతపట్నం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పాతపట్నం- మెళియాపుట్టి, పాతపట్నం-టెక్కలి రోడ్లపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. ప్రధానంగా సీతారాంపల్లి, గంగువాడ, తెంబూరు గ్రామాల వద్ద గోతుల్లో నీరుచేరి చెరువులను తలపిస్తున్నాయి. కిమిడి-రుగడ బీటీ రోడ్ పనులు పూర్తికాకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాతపట్నం-సరాళి, టెక్కలి రోడ్-సింగుపురం రహదారి పనులు కూడా జరగడం లేదు. కోణంగి-మర్రిపాడు బీటీ రోడ్డు కోణంగి సమీపంలో భారీ కోతకు గురైంది.

బురదమయం..


గోతులమయమైన జక్కర రోడ్డు

కంచిలి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి నుంచి జక్కర కాలనీకి వెళ్లే రోడ్డుతో పాటు కేశరపడ వెళ్లే దారిలో అర్జునాపురం వద్ద రోడ్డు గోతులమైంది. నారాయణబట్టి కల్వర్టు వద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఎంఎస్ పల్లి-దాళేశ్వరం వెళ్లే రహదారి సైతం బురదమయం కావడంతో మోడల్ స్కూల్‌కి వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పాడైన లింక్ రోడ్లు..

ఎచ్చెర్ల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రావెల్, మట్టి రోడ్లు అధ్వానంగా మారాయి. ఓపి అగ్రహారం నుంచి ఆర్‌అండ్‌బీ రోడ్డు, ముద్దాడ నుంచి రుప్పపేట, సెగిడిపేట మీదుగా కొయ్యావానిపేట గ్రామానికి వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నాయి. జాతీయ రహదారి నుంచి అరిణాం అక్కివలసకు వెళ్లే రోడ్డు కూడా పాడైంది. ఈ రోడ్లపై నడవడానికి కూడా వీల్లేని పరిస్థితిలో ఉండడంతో ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు.


ముద్దాడ నుంచి కొయ్యావానిపేట గ్రామానికి వెళ్లే రోడ్డు

గోతులతో ఇబ్బందులు..


తొలుసూరుపల్లి రోడ్డు ఇలా..

టెక్కలి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎన్‌ఎం రోడ్డుతో పాటు టెక్కలి-తొలుసూరుపల్లి రోడ్డులో పెద్దఎత్తున గోతులు ఏర్పడ్డాయి. అధికారులు గోతులు పూడ్చకపోవడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గోతులు మూలంగా పాదచారులు సైతం నానా ఇబ్బందులు పడుతున్నారు. గోతులు పూడ్చాలని పాదచారులు, వాహనచోదకులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా..


ఇచ్ఛాపురం మెయిన్ రోడ్ ఇలా..

ఇచ్ఛాపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం ప్రధాన రహదారి గోతులతో ప్రమాదకరంగా తయారైంది. పాదచారులు, వాహనదారులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

ప్రయాణించాలంటే భయం..


ఛిద్రమైన టీఎల్‌పాడు రోడ్డు

జలుమూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అబ్బాయిపేట నుంచి టీఎల్‌పాడు వరకు ఉన్న 4 కి.మీ రహదారి గోతులమయమైంది. కొమనాపల్లి-అల్లాడ రోడ్డు ఛిద్రమైంది. తిమడాం నుండి మాకివలస మీదుగా పర్లాం వరకు వెళ్లే రహదారి పూర్తిగా గోతులతో నిండిపోయింది. ఈ రోడ్లపై ప్రయాణించడానికి వాహనచోదకులు, ప్రజలు భయపడుతున్నారు.

గ్రావెల్‌తో పూడ్చి వదిలేశారు..


కల్లాడ-దిమ్మిడిజోల రోడ్డుపై కోతకు గురైన ప్రాంతాన్ని గ్రావెల్‌తో పూడ్చిన దృశ్యం

నందిగాం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెద్దతామరాపల్లి- తూముకొండ ఆర్‌అండ్‌బీ రహదారి కల్లాడ, దిమ్మిడిజోల మధ్య కోతకు గురైంది. దీంతో మండల పరిధిలోని ఏడు గ్రామాలతో పాటు మెళియాపుట్టి మండలం నుంచి నందిగాం మండలం వచ్చే వాహనచోదకుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అధికారులు స్పందించి యుద్ధప్రాతిపదికన కోతపడిన రహదారిని పూడ్చినప్పటికీ బీటీ ఏర్పాటు కాలేదు. ఇప్పటికైనా బీటీ ఏర్పాటు చేయాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

అడుగుకొక గొయ్యి..

పలాసరూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): లొద్దభద్ర పంచాయతీ పరిధిలోని మహాదేవిపురం, పొత్రియ, నవరఘునాథపురం, బాపనూరు, గట్బూరు గ్రామాల రోడ్లు ఛిద్రమయ్యాయి. మహాదేవపురం నుంచి నవర గోవిందపురం వరకూ కచ్చా రోడ్డు సుమారు 8 కిలోమీటర్ల పరిధిలో అడుగుకొక గొయ్యి దర్శనమిస్తోంది. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.


మహాదేవపురం-బాపనూరు రోడ్డు దుస్థితి

మందసలో..

సింగుపురం, సాబకోట గ్రామాల రహదారులు దెబ్బతిన్నాయి. డిమిరియా గ్రామం పక్క నుంచి ప్రవహిస్తున్న మహేంద్రతనయ కాలువ ఉధృతికి రోడ్డుకు బాగా నష్టం వాటిల్లింది. దీంతో స్థానికులు ఇసుకబస్తాలు, కర్రలు, దిమ్మలను అడ్డుపెట్టారు.


డిమిరియా వద్ద కోతకు గురైన రోడ్డుకు అడ్డుగా పెట్టిన ఇసుక బస్తాలు

కొట్టుకుపోయింది..


మొగిలిపాడు-గొప్పిలి రోడ్డులో ఫ్లైఓవర్ వద్ద కోతకు గురైన దృశ్యం

పలాస, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): శాసనం-రాజగోపాలపురం రహదారిని కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నిర్మించారు. అయితే మొంథా తుఫాన్‌తో కురిసిన భారీ వర్షాలకు ఈ రోడ్డులో సగభాగం కొట్టుకుపోయింది. ప్రస్తుతం ఆ ప్రాంతంలో రాకపోకలకు ఇబ్బంది కలుగుతుంది. దీనికి ఇంకా బిల్లులు కూడా చెల్లించలేదని తెలుస్తోంది. మొగిలిపాడు-గొప్పిలి రోడ్డులో భారీ నీరు ప్రవహించడంతో అనేక ప్రాంతాల్లో రోడ్డు కోతకు గురైంది.

కాలినడకకూ కష్టమే..


బొందికారి రోడ్డు వంతెన వద్ద ఇలా..

హరిపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మందస మండలంలో సుమారు 18 రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. మందస-మెళియాపుట్టి ఎంఎం రోడ్డు, శాసనాం రోడ్డు, చీపి-బుడంబో రహదారి, బుడార్సింగి, చిన్నకోష్ఠ, డబార్సింగి, కొండలోగాం, పట్టులోగాంతోపాటు ఉద్దానం ప్రాంతంలోని రహదారులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. దీంతో కాలినడకకూ కష్టతరంగా మారాయి. చీపి-బొందికారి మధ్య రహదారి వంతెన పూర్తిగా కూలిపోయి రాకపోకలకు కష్టంగా మారింది.

వాహనదారులకు కష్టం..

హిరమండలం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గత నెలలో వంశధార నదికి వచ్చిన వరద ప్రవాహానికి పలు రోడ్లు ధ్వంసమయ్యాయి. నది పక్కనే ఉన్న గులుమూరు-నివగాం రహదారిపై వరద నీరు ప్రవహిచండంతో రోడ్డు చాలాచోట్ల ఛిద్రమైంది. దీంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు.


దెబ్బతిన్న గులుమూరు-నివగాం రహదారి

ఇప్పుడే ఫీల్డ్‌కు వెళ్లారు

(ఐదో పేజీ తరువాయి)

ఆమదాలవలస, పలాస-కాశీబుగ్గ, ఇచ్ఛాపురం పట్టణాల్లో వార్డు సచివాలయాలను మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షిస్తున్నారు. గ్రామ సచివాలయాలను ఎంపీడీవోలు పర్యవేక్షిస్తున్నారు. ఇతర ఉన్నతాధికారుల పర్యవేక్షణ అంతగా లేదు. 8 నుంచి 10 మంది సిబ్బందికిగాను కేవలం ఇద్దరు.. ముగ్గురు మాత్రమే ఉంటున్నారు. సమయపాలన పాటించకపోవడం పలు చోట్ల కనిపించింది.

● ఇతర ప్రభుత్వ విభాగాల మాదిరిగా సచివాలయాల్లోనూ డెప్యుటేషన్ నడుస్తోంది. పలుకుబడి కలిగినవారు... ఉన్నతాధికారుల మెప్పు పొందినవారు.. ఇతరత్రా కారణాలు.. సిఫారసులతో డెప్యుటేషన్‌పై ఇతర కార్యాలయాలకు వెళ్లిపోతున్నారు. దీనివల్ల ప్రజలకు గ్రామాల్లో సరిగ్గా సేవలందడం లేదు. ఈ విషయాన్ని ఇటీవల జిల్లా పరిషత్ సమావేశంలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే ప్రస్తావించారు. ఆ ప్రాంతంలో సచివాలయాల సిబ్బంది కొంతమంది కలెక్టరేట్‌లో డెప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. ఇతర నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు తీసుకుని సచివాలయాల వ్యవస్థను ప్రక్షాళన చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

సచివాలయంలో ఒక్కరే..


నరసన్నపేట సచివాలయం-3లో ఒక్కరే విధులు నిర్వహిస్తున్న దృశ్యం

నరసన్నపేట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట సచివాలయం -3లో ఏడుగురు ఉద్యోగులకుగాను సోమవారం ఉదయం ఒక్కరే విధుల్లో కనిపించారు. ఏఎస్‌ఎం పోస్టు ఖాళీ. డిజిటల్ అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు లాంగ్ లీవ్‌లో ఉన్నారు. వీఆర్వో కిల్లాం భూసర్వేలో విధులకు హాజరయ్యారు. సర్వేయర్ తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లగా.. ఒక్క వెల్ఫేర్ అసిస్టెంట్ మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. మహిళా పోలీసు హౌడ్కోకాలనీలో వాట్సప్ సర్వేలో పాల్గొనేందుకు వెళ్లినట్లు సిబ్బంది తెలిపారు.

వీఆర్వో కోసం కాజీపేట వెళ్లాల్సిందే..


కేవలం ఇద్దరు సిబ్బందికే పరిమితమైన అరసవల్లి, వెలమ వీధి సచివాలయం

అరసవల్లి: అరసవల్లి, వెలమవీధి సచివాలయంలో 9 మంది సిబ్బందికి గాను కేవలం ఇద్దరు మాత్రమే అందుబాటులో ఉన్నారు. ఆఫీసుకు సంబంధించి ప్రస్తుతం ఒక కంప్యూటర్ మాత్రమే పనిచేస్తోంది. కాజీపేట వీఆర్వోకు ఇక్కడ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ప్రజలు తమ అవసరాల కోసం కాజీపేట వెళ్లి పనులు చేయించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఎమెనిటీస్ సెక్రటరీ, ప్లానింగ్ సెక్రటరీ కూడా లేరు. సచివాలయ అడ్మిన్, డేటా ప్రాసెసర్ సెలవులో ఉన్నారు. దీంతో వెల్ఫేర్ సెక్రటరీ, ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ సిబ్బంది.. అంటే కేవలం ఇద్దరు మాత్రమే విధులకు హాజరవుతున్నారు. అలాగే ఎల్‌బీఎస్ కాలనీలోని అరసవల్లి సచివాలయంలో కూడా డిప్యూటేషన్లతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ కూడా శానిటేషన్, ఎమినిటీస్ సెక్రటరీలు డిప్యూటేషన్లపై వేరేచోట పనిచేస్తున్నారు. వీఆర్వో అవసరం కూడా ఉంది.

సిబ్బంది లేక అవస్థలు..

ఎచ్చెర్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జరజాం గ్రామ సచివాలయం పరిధిలో జరజాం, తంగివానిపేట, బట్నవానిపేట, గొలివివానిపేట గ్రామాలు ఉన్నాయి. ఈ సచివాలయానికి శాశ్వత భవనం ఉన్నా, పూర్తిస్థాయి సిబ్బంది లేరు. వీఆర్వో పోస్టు ఖాళీగానే ఉంది. ఎచ్చెర్ల వీఆర్వో జరజాంకు ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సోమవారం పరిస్థితిని పరిశీలిస్తే పంచాయతీ కార్యదర్శి ఆన్‌డ్యూటీలో భాగంగా కోర్టు పనికి హాజరయ్యారు. వెటర్నరీ, వెల్ఫేర్ అసిస్టెంట్లు సెలవులో ఉన్నారు. ఏఎన్‌ఎంను ఇటీవల పొందూరు మండలానికి డెప్యుటేషన్‌పై పంపించారు. సర్వేయర్, ఇంజనీరింగ్, డిజిటల్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు మాత్రమే విధుల్లో ఉన్నారు. అగ్రికల్చరల్ అసిస్టెంట్ కొత్తపేట, జరజాం గ్రామాలకు ఒక్కరే విధులు నిర్వర్తిస్తున్నారు.

నలుగురు మాత్రమే హాజరయ్యారు..


అరకొర వచ్చే అర్జీదారుల వివరాలు సేకరిస్తున్న సచివాలయ సిబ్బంది

పాతపట్నం నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పాతపట్నం సచివాలయం-2లో ఎనిమిది మంది సిబ్బందికి గాను నలుగురు మాత్రమే విధులకు హాజరయ్యారు. కొందరు మాత్రమే సమయపాలన పాటిస్తున్నారు. మహిళా పోలీస్ మెటర్నిటీ లీవ్‌లో ఉన్నారు. వ్యవసాయ సహాయకుడు కుమార్‌రాజా కలెక్టరేట్ కార్యాలయానికి డెప్యుటేషన్‌పై వెళ్లారు. వీఆర్వో వెంకటరమణ విజన్-2047 నిర్వాహణలో భాగంగా ఎంపీడీవో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఖాళీగా ఉంది.


సరుబుజ్జిలి సచివాలయం

పర్యవేక్షణలేక..

ఎల్.ఎన్.పేట: మండలంలో 12 సచివాలయాలు ఉండగా.. చాలా మంది ఉద్యోగులు ఉదయం 11 నుంచి 11.30 గంటల మధ్య విధులకు హాజరవుతున్నారు. పెద్దకోట-2 గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి, రెవెన్యూ కార్యదర్శి, వెల్ఫేర్ అసిస్టెంటు, డిజిటల్ అసిస్టెంటు, ఇంజినీరింగ్ అసిస్టెంటు, అగ్రికల్చర్ అసిస్టెంటు, సర్వేయర్ పోస్టులు ఉన్నాయి. ఇక్కడ డిజిటల్ అసిస్టెంటు డిప్యుటేషన్‌పై కలెక్టరేట్‌లో, సర్వేయర్ డిప్యుటేషన్‌పై పాతపట్నంలో పనిచేస్తున్నారు. మహిళా పోలీసు మెటర్నిటీలీవ్‌లో ఉన్నారు. మిగిలిన నలుగురిలో ఒకరిద్దరు మాత్రమే సచివాలయంలో అందుబాటులో ఉంటున్నారు. వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

సమయానికి రాక.. సమస్యలు తీర్చక

కోటబొమ్మాళి: మండలంలో కొత్తపేట, కిష్టపురం, కురుడు, శ్రీ జగన్నాథపురం, చీపుర్లపాడు, తర్లిపేట గ్రామ సచివాలయాల్లో 11 గంటల వరకు ముగ్గురు, నలుగురు మాత్రమే విధులకు హాజరయ్యారు. మిగిలిన వారు ఫీల్డ్‌లో ఉన్నట్టు సిబ్బంది తెలిపారు.

సేవలు అరకొర..

సరుబుజ్జిలి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 14 గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు అరకొర సేవలు మాత్రమే అందుతున్నాయి. సరుబుజ్జిలి గ్రామ సచివాలయంలో మహిళా పోలీస్, పంచాయతీ కార్యదర్శి, సర్వేయర్ పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ఇప్పటి వరకు రీ గ్రూపింగ్ విధానం ఇంకా ప్రారంభించలేదు.

సమయపాలన ఎక్కడ?

ఇచ్ఛాపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం మునిసిపాలిటీలో 10 వార్డు, 16 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. ఏ ఒక్క సచివాలయంలో పూర్తిస్థాయిలో సిబ్బంది లేరు. గ్రామ సచివాలయాల్లో 93 పోస్టులకుగాను 74 మంది, వార్డు సచివాలయాల్లో వంద మందికిగాను 48 మంది ఉద్యోగులు మాత్రమే ఉన్నారు. సచివాలయాల్లో మునిసిపల్ కమిషనర్, ఎంపీడీవో అధికారులు పర్యవేక్షణ లేకపోవటంతో సిబ్బంది ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారు. ఉద్యోగులు సమయపాలన పాటించక పోవడంతో ప్రజలు ఎదురుచూడాల్సి వస్తోంది. సోమవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో మండపల్లి సచివాలయంలో ఒక్కరు మాత్రమే విధుల్లో కనిపించారు. పూర్తిస్థాయిలో సిబ్బంది లేక కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి.

సేవలు అంతంతమాత్రమే..

జి.సిగడాం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జి.సిగడాం మండలంలోని సచివాలయాల్లో సేవలు అంతంతమాత్రమే అందుతున్నాయి. 21 సచి వాలయాలు ఉండగా.. ప్రతిచోటా ఒకరిద్దరు మాత్రమే అందుబాటులో ఉంటున్నారు. మిగతా ఉద్యోగులు సర్వేల పేరిట ఫీల్డ్‌కు పరిమితమవుతున్నారు. పాలఖండ్యాంలో వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీసు, మెట్టవలసలో పంచాయితీ కార్యదర్శి, వీఏఏలు మాత్రమే విధుల్లో ఉన్నారు. మిగతా వారు ఫీల్డ్‌కి, వనభోజనాలకు వెళ్లారని సిబ్బంది చెప్పారు.

కార్యాలయంలో ఇద్దరే..

సోంపేట: సోంపేట మండలం పలాసపురం సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి మాత్రమే అందుబాటులో ఉన్నారు. వీఆర్‌వో పోస్టు ఖాళీగా ఉండగా, సర్వేయర్ మాత్రం ఇన్‌చార్జితో నెట్టుకొస్తున్నారు.

సమయపాలన లేదు..

కంచిలి: మండలంలోని కంచిలి 1, కేబీ నౌగాం, బొగాబెణి, బూరగాం సచివాలయాల్లో సిబ్బంది కొరత.. విధుల్లో నిర్లక్ష్యం కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అర్జీల పరిష్కారానికి ఎదురుచూపులు తప్పడం లేదు. సంక్షేమ పథకాల నమోదు, అర్హుల పరిశీలన ప్రక్రియలో జాప్యం జరుగుతోంది. మండలంలో 22 సచివాలయాలు ఉండగా చాలా మంది సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. దీనిపై ఎవరైనా ప్రశ్నిస్తే ఫీల్డ్‌వర్క్‌లో ఉన్నామని చెప్పడం సాధారణమైపోయింది.

పంచాయతీ భవనంలోనే..

వజ్రపుకొత్తూరు: అక్కుపల్లి సచివాలయం సిబ్బంది స్థానిక పంచాయతీ భవనంలోనే విధులు నిర్వహిస్తున్నారు. సోమవారం ఉదయం 10.30 గంటలకు నలుగురు సిబ్బంది మాత్రమే హాజరయ్యారు. ఈ సచివాలయం కార్యదర్శి ఓ మంత్రికి పీఏగా ఉన్నట్లు ఎంపీడీవో రమేష్‌నాయుడు చెప్పారు. దీంతో పక్కనే ఉన్న బాతుపురం కార్యదర్శి ఇన్‌చార్జి బాధ్యతలు చేపడుతున్నారని తెలిపారు. సర్వేయర్ దీర్ఘకాలిక సెలవులో ఉన్నారు. అక్కుపల్లికి సచివాలయ భవనం మంజూరైనా పాఠశాల ఆవరణలో నిర్మాణాలు చేయడంతో కోర్టు ఆదేశాల మేరకు పనులు నిలిచిపోయాయి.

ఇళ్ల పండుగ

లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లను బుధవారం పంపిణీ చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు అన్నమయ్య జిల్లాలో ప్రారంభించగా జిల్లాలో అధికారులు, ఎమ్మెల్యేలు ఇళ్లను, మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందించారు.



అరసవల్లి: లబ్ధిదారుకి తాళంచెవి అందజేస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

పక్కా ఇల్లే లక్ష్యంగా చర్యలు: శంకర్

అరసవల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి):: ప్రతీ పేదవానికి పక్కా ఇల్లు అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పనిచేస్తోందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. పీఎంఏవైలో భాగంగా రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన ఇళ్లను లబ్ధిదారులకు నగరంలోని మొండి వీధిలో బుధవారం అందజేశారు. జిల్లాలో ఇప్పటివరకు 2,900 ఇళ్లు పూర్తి చేయడం జరిగిందని, ఇప్పుడు 2.0లో భాగంగా 286 ఇళ్లు మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో డీఆర్వో వి.లక్ష్మణ మూర్తి, హౌసింగ్ పీడీ రమాకాంత్, మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రసాదరావు, పరిశ్రమల శాఖ మేనేజర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: అశోక్

కవిటి/ఇచ్ఛాపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. ఇచ్ఛాపురం మునిసిపాల్టీ పరిధిలో పీఎంఏవై కింద 123 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలను బుధవారం రామయ్యపుట్టుగలో అందించారు. లబ్ధి దారులు ప్రభుత్వ సహకారంతో సొంతంగా ఇళ్లు నిర్మించుకోవాలన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ సుధాకర్, మునిసిపల్ కమిషనర్ ఎన్.రమేష్, ఏఈ వీఎం ప్రసాద్, పార్టీ నాయకులు కొండా శంకర్‌రెడ్డి, జానకిరావు, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.



కవిటి: లబ్ధిదారుకు ఇంటి మంజూరు పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే అశోక్

అర్హతే ప్రాతిపదికగా గృహాలు: ఎంజీఆర్

పాతపట్నం/రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అర్హతే ప్రాతిపదికగా కూటమి ప్రభుత్వం గృహాలు మంజూరు చేస్తుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. బుధవారం తిడ్డిమి గ్రామంలో ప్రభుత్వ నిధులతో పూర్తిచేసుకుని జరిగిన గృహ ప్రారంభోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. గత వైసీపీ హయాంలో ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వాహణాధికారి డి.సత్యనారాయణ, టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, తహసీల్దార్ నందగామ ప్రసాదరావు, ఎంపీడీవో కృష్ణమూర్తి, హౌసింగ్ డీఈ ఎం.మోహనరావు, ఏఈ వై.సీతారామరాజు కూటమి నాయకులు పాల్గొన్నారు.



పాతపట్నం: గృహ మంజూరు పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

అర్హులందరికీ ఇళ్లు: బగ్గు

పోలాకి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేస్తుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి భరోసా ఇచ్చారు. బుధవారం తలసముద్రం గ్రామంలో నిర్మాణం పూర్తయిన ఇళ్లను ఆయన ప్రారంభించారు. కూటమి ప్రభుత్వంలో ఇల్లులేదనే మాట రాకూడదన్నారు. మంజూరు చేసిన ఇంటిని త్వరగా లబ్ధిదారుడు నిర్మించుకోవాలన్నారు. గత ప్రభుత్వం ఇళ్లు రానీయకుండా కేంద్రం పంపిన నిధులు దుర్వినియోగం చేసిందన్నారు. తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఎంపీడీవో రవికుమార్, హౌసింగ్ డీఈ, ఏఈ, కూటమి నాయకులు ఎంవీ నాయుడు, కిల్లి వేణు, ప్రగడ సూరిబాబు పాల్గొన్నారు.



పోలాకి: ఇంటిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

లోలుగులో ఇళ్ల పంపిణీ

పొందూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పేదవాడికి సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని డీఆర్‌డీపీ పీడీ పి.కిరణ్‌కుమార్ అన్నారు. లోలుగు గ్రామంలో బుధవారం నిర్మాణం పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ, ఎమ్మెల్యే రవికుమార్ సతీమణి కూన ప్రమీల, గృహ నిర్మాణశాఖ ఏడీ డి.సన్యాసిరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కూన వెంకట సత్యనారాయణ, మండల ప్రత్యేకాధికారి రఘునాథ్, ఎంపీడీవో వాసుదేవరావు, తహసీల్దార్ వెంకటేష్, కూటమి నాయకులు సీపాన శ్రీరంగనాయకులు, బలగ శంకరభాస్కరరావు, గాడు నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.



పొందూరు: మాట్లాడుతున్న డీఆర్‌డిపి పీడీ కిరణ్‌కుమార్

న్యూస్ బాక్స్

ఏజీపీల నియామకం

శ్రీకాకుళం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడు న్యాయస్థానాలకు అసిస్టెంట్ గవర్న మెంట్ ప్లీడర్ (ఏజీపీ)లను నియమిస్తూ బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నరసన్నపేట సివిల్ కోర్టు(జూనియర్ డివిజన్)లో ఏజీపీగా వాన శ్రీనివాసరావు నియమితు లయ్యారు. సోంపేట ప్రిన్సిపల్ సివిల్ కోర్టు(జూనియర్ డివిజన్)లో ఏజీపీగా సనపల విశ్వనాథం నాయుడు, సోంపేట సివిల్ కోర్టు (సీనియర్ డివిజన్) ఏజీపీగా వంకాయల ధర్మారావు నియమితులయ్యారు. ఈ మేరకు లీగల్ అండ్ లెజిస్లేటివ్ అఫైర్స్ జస్టిస్ ప్రభుత్వ కార్యదర్శి గొట్టాపు ప్రతిభాదేవి ఉత్తర్వులు జారీచేశారు.

ఆర్టీసీకి దాతలు సహకరించాలి

అరసవల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రజా రవాణా వ్యవస్థలో ప్రభుత్వ తోడ్పాటుకు దాతలు సహకరించాలని శ్రీకాకుళం 1, 2 డిపో మేనేజర్లు అమరసింహుడు, శర్మ అన్నారు. దంత వైద్యులు సింగూరు జ్యోత్స్న, చైతన్య 100 ప్రథమ చికిత్స కిట్లను బుధవారం ఆర్టీసీ అధికారులకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రయాణికులకు అత్యవసర సమయంలో ఈ కిట్లు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ ప్రసాదరావు, సంతోష్, గంగరాజు, పలువురు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత భూముల పరిశీలన

కవిటి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): గొర్లెపాడు గ్రామాన్ని బుధవారం రెవెన్యూ అధికారులు సందర్శించారు. గ్రామంలో ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురయ్యాయని సీపీఐ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు చేసిన ఫిర్యాదు మేరకు తహసీల్దార్ మురళీమోహన్ సిబ్బందితో కలిసి ఫిర్యాదుదారుల సమక్షంలో సదరు భూములను పరిశీలించారు.

సామాజిక స్పృహతో రచనలు చేయాలి

గుజరాతీపేట. నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సామాజిక స్పృహతో వర్ధమాన రచయితలు రచనలు చేయాలని పౌరసరఫరాల శాఖ సంచాలకుడు రోణంకి గోవిందరావు అన్నారు. స్థానిక మునిసిపల్ మైదానంలో జరుగుతున్న సిక్కోలు పుస్తక మహోత్సవంలో బుధవారం రచయిత కూన రంగారావు రచించిన ఆఖరి మెట్టు నవలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ జిల్లా అధ్యక్షుడు పిసిని వసంతరావు, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొప్పల భానుమూర్తి, కె.భుజంగరావు, బి.గౌరీ శంకర్, పి.తిరుపతిరావు, డి.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు. రఘుపాత్రుని శ్రీకాంత్ ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శనలు, లలిత సంగీతం, సంగీత కళాక్షేత్రం బృందం ఆధ్వర్యంలో అన్నమయ్య కీర్తనలు ఆకట్టుకున్నాయి.



పుస్తకావిష్కరణ చేస్తున్న అతిథులు

సన్న బియ్యం పేరిట మోసం

- రణస్థలంలో వెలుగు చూసిన ఘటన
- వ్యాపారులకు దేహశుద్ధి

రణస్థలం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సన్న బియ్యం అంటూ పలువురికి ముతక బియ్యం ఇచ్చి కొందరు వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు.. కొందరు 25 కేజీల సన్న బియ్యాన్ని రూ.1000కి అందిస్తామని నమ్మబలికి మోసం చేస్తున్నారు. శ్యాంపిల్‌గా సన్న బియ్యాన్ని చూపి ఆ తరువాత బ్రాండెడ్ బ్యాగుల్లో దుడ్డు బియ్యం నింపి ప్రజలను మోసం చేస్తున్నారు. ఇలాంటి ఘటనే బుధవారం రణస్థలంలో బయటపడింది. ఇద్దరు వ్యక్తులు ఓ హోటల్ యజమానికి ఇలానే సన్న బియ్యం అని చూసి ఆ తరువాత దుడ్డుబియ్యాన్ని అంటగట్టేందుకు ప్రయత్నించారు. అయితే సదరు హోటల్ యజమాని విషయాన్ని పసిగట్టి గతంలో మోసపోయిన బాధితులను పిలవడంతో అసలు విషయం బయటపడింది. ఆ ఇద్దరూ గతంలో మోసం చేసిన వారేనని తేలడంతో స్థానికులు వారికి దేహశుద్ధి చేశారు. బ్రాండెడ్ బ్యాగుల్లో దుడ్డు బియ్యం నింపి బస్తాను కుట్టి మోసం చేస్తున్నట్లు బయటపడింది. దీంతో సదరు వ్యక్తులకు దేహశుద్ధి చేసి వారి నుంచి నగదు రికవరీ చేశారు. ఈ ఘటన స్థానికంగా సంచలనం రేకెత్తించింది.



బియ్యం ప్యాకెట్‌ను కుట్టే మిషన్ ఇదే



బియ్యాన్ని విక్రయిస్తుంది వీరే..

కేసుల సత్వర పరిష్కారానికి మధ్యవర్తిత్వం మేలు



మాట్లాడుతున్న 4వ అదనపు జిల్లా న్యాయాధికారి ఫణికుమార్

శ్రీకాకుళం లీగల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేయాలంటే మధ్యవర్తిత్వమే మేలని 4వ అదనపు జిల్లా న్యాయాధికారి ఎస్.ఎం ఫణికుమార్ అన్నారు. జిల్లా బార్‌అసోసియేషన్ హాలులో బుధవారం న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. 1వ అదనపు జిల్లా న్యాయాధికారి పి.భాస్కరరావు మాట్లాడుతూ.. వచ్చే నెల 13న జరగనున్న లోక్‌అదాలత్ ఎక్కువ కేసుల పరిష్కారంలో న్యాయవాదులు చొరవచూపాలన్నారు. సమావేశంలో 3వ అదనపు జిల్లా న్యాయాధికారి వివేకానంద శ్రీనివాస్, జిల్లాన్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె. హరిబాబు, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తంగి శివప్రసాద్, ప్రధాన కార్యదర్శి పిట్టా దామోదర్, ఉపాధ్యక్షుడు సీతరాజు, మహిళా ప్రతినిధి గురుగుబెల్లి వనజాక్షి, స్టేట్ బార్ అసోసియేషన్ ప్రతినిధి గేదెల వాసుదేవరావు, సీనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

అరసవల్లి ఆలయ అభివృద్ధికి కృషి

అరసవల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. బుధవారం ఆలయాన్ని సందర్శించి ఈవోతో చర్చించారు. సమస్యలను దేవదాయశాఖ మంత్రి, కమిషనర్‌కు ఫోన్ ద్వారా తెలియజేశారు. కమిషనర్ ఆదేశాలతో ఈవో ఈ మేరకు కేఎన్‌వీడీవీ ప్రసాద్ విజయవాడ బయలు దేరి వెళ్లారు. సిబ్బంది నియామకం, ఇతర అవసరాలను సంబంధించి అనుమతులు పొందేం దుకు చర్యలు తీసుకుంటున్నారు. ఆలయ కార్యాలయంలో పనిచేస్తున్న కొంతమంది దినసరి వేతన సిబ్బంది పనితీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు.

స్కానింగ్ సెంటర్లు నిబంధనలు పాటించాలి

అరసవల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న అన్ని స్కానింగ్ సెంటర్లు, ప్రైవేటు ఆసుపత్రులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.మేరీ క్యాథరిన్, అడిషనల్ డీఎంహెచ్‌వో డా.తాడేల శ్రీకాంత్ అన్నారు. ఈ మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో బుధవారం జిల్లాస్థాయి పీసీపీఎన్‌డీటీ సలహా కమిటీ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతీ ఆసుపత్రి, స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు ఫారం-ఎఫ్‌లను విధిగా అప్‌లోడ్ చేయాలని, సీసీ కెమెరాల పర్యవేక్షణ సక్రమంగా ఉండాలని, నిబంధనలను అతిక్ర మించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసు కోవడం జరుగుతుందన్నారు. సమావేశంలో వైద్యులు స్వర్ణలత, కిరణ్‌కుమార్, రాజేష్ కుమార్, డిప్యూటీ హెచ్ ఈవోలు ఎస్.విజయ లక్ష్మి, మోహినీ, రత్నకుమారి, డెమో సిబ్బంది పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి: ఎన్‌ఈఆర్

రణస్థలం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికా భివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకంలో మంజూరైన టూల్‌కిట్లను నాయీ బ్రాహ్మణులకు అందజేశారు. ఆర్థిక సాధికారతకు ఈ పథకం దోహదపడుతుందన్నారు. నాయీ బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.



కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఎన్‌ఈఆర్

సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయండి


ఇచ్ఛాపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) విశాఖపట్నంలో డిసెంబరు 31 నుంచి 5 రోజుల పాటు జరగనున్న 18వ అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, కార్యదర్శి ఎస్.లక్ష్మీనారాయణ, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.సుదర్శనం కోరారు. ఈ మేరకు బుధవారం ఐసీడీఎస్ కార్యాలయంలో మహాసభల పోస్టర్లను ఆవిష్కరించా రు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు బి.హైమావతి, బాలామణి, హేమలత, భారతి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

పాడి ఉత్పత్తితో అభివృద్ధి

జి.సిగడాం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పాడి ఉత్పత్తితో రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని శ్రీకాకుళం డివిజన్ పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ బీవీ రమణ అన్నారు. బుధవారం ఆనందపురంలో ఆడదూడల ఉత్పత్తి పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రాయితీపై ఇస్తున్న పశుగ్రాసాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏడీ ఎస్ రఘునాథ్, టీడీపీ మండల అధ్యక్షుడు కుమరాపు రవికుమార్, బీజేపీ జిల్లా కార్యదర్శి వజ్జపర్తి రఘురాం, పశు వైద్యాధికారులు ఉప్పాడ సుమన్, వెంకటరమణ, హేమంత్, తదితరులు పాల్గొన్నారు.

యాదవ కులానికి సముచిత స్థానం కల్పించాలి

సోంపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): దేశంలో యాదవులకు సముచితస్థానం కల్పించాలని ఆ సంఘ జాతీయ అధ్యక్షుడు మహేష్ యాదవ్ కోరారు. స్థానిక ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో బుధ వారం సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉత్తరాంధ్రలో ఉన్న యాదవులకు బీసీ-డి నుంచి బీసీ-బిలోకి చేర్చా లని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ, యాదవసంఘం జిల్లా అధ్యక్షుడు నర్తు రామారావు, జాతీయ కార్యదర్శి అన్న రామచంద్రయ్య, రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు, రాష్ట్ర కార్యదర్శి ఆవుల నరసింహారావు, వివిధ పార్టీల యాదవ కులసంఘ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహేష్

బకాయిలు వెంటనే చెల్లించాలి

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రిమ్స్ కాంట్రాక్టు కార్మికుల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.మురళి, కార్యదర్శి ఆర్. ప్రకాశరావు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రిమ్స్ కాంట్రాక్టు అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ వద్ద సెక్యూరిటీ సిబ్బంది ధర్నా నిర్వహించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ.. 15 ఏళ్లుగా సేవలందిస్తున్న సిబ్బందికి ప్రతీ నెలా 5వ తేదీన వేతనాలు చెల్లించాల్సి ఉన్నా దానిని అమలు చేయడం లేదన్నారు. సమస్యల ను పరిష్కరించాల్సిన రిమ్స్ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తక్షణం వారితో చర్చించి బకాయిలు చెల్లించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.25 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వారు జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మణమూర్తికి వినతిపత్రం అంద జేశారు. ఆ సంఘ నాయకులు రామారావు, సూర్యనారాయణ, సత్యనారాయణ, వెంకటరమణ, మాధవి, రాజేశ్వరి, కుసుమ, ఈశ్వరమ్మ, సూర్యకాంతం తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న రిమ్స్ కాంట్రాక్ట్ కార్మికులు

విద్యార్థుల అమానుషం

- తోటి విద్యార్థిపై లైంగిక వేధింపులు
- ఆలస్యంగా వెలుగులోకి..

రణస్థలం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వసతి గృహంలో ఉంటూ ఏడో తరతి విద్యార్థిపై లైంగిక వేధింపులకు పాల్పడిన విద్యార్థుల ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. రణస్థలం మండల కేంద్రంలోని ఒక ప్రభుత్వ హాస్టల్‌లో ఈ ఘోరం జరిగింది. హాస్టల్లో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు వసతి పొందుతున్నారు. ఏడో తరగతి చదువుతున్న ఓ విద్యార్థి నీరసంగా కనిపించాడు. అక్కడ వంట మనిషిగా పనిచేస్తున్న ఒక వ్యక్తి దీనిని గమనించి ఆరా తీశాడు. తనకు ఎదురైన పరాభవాన్ని ఆ విద్యార్థి వివరించాడు. హాస్టల్‌లో ఉంటూ తొమ్మిదో తరగతి చదువుతున్న నలుగురు విద్యార్థులతో పాటు మరో పదో తరగతి విద్యార్థి గత కొద్ది రోజులుగా ఏడో తరగతి విద్యార్థిపై లైంగిక వేధింపులకు పాల్పడి వీడియోలు తీస్తున్నారు. వాటిని పట్టుకుని బ్లాక్ మెయిల్‌కు పాల్పడ్డారు. అయితే ఆ విద్యార్థిలో వస్తున్న మార్పును గమనించిన వంట మనిషి ఈ విషయాన్ని విద్యార్థులు చదువుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారికి టీసీలిచ్చి హెచ్‌ఎం పంపించినట్లు తెలిసింది.

అయితే వేధింపులకు గురైన విద్యార్థిని చికిత్స నిమిత్తం వంట మనిషి కొండ ములగాం ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కి తర లించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జేఆర్‌పురం ఎస్‌ఐ ఎస్.చిరంజీవి తెలిపారు.

దైవదర్శనానికి వెళ్లి.. తిరిగిరాని లోకాలకు

(5వ పేజీ తరువాయి)

వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. తహసీల్దార్ జె.రామారావు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను బుధవారం విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఒకే గ్రామానికి చెందిన వ్యక్తులు ప్రమాదానికి గురవడంతో గుర్రాలపాలెంలో విషాదచాయలు అలముకున్నాయి. మృతి చెందిన గట్టెం పద్మావతికి భర్త అప్పలరాజు, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. గట్టెం అచ్చాయమ్మకు భర్త నాగరాజు, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బి.అశోక్‌బాబు తెలిపారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడి మృతి


మృతిచెందిన వృద్ధుడు

కంచిలి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పలాస రైల్వేస్టేషన్ పరిధి సోంపేట-జాడపూడి ఆర్ఎస్ డౌన్ వద్ద బుధవారం రైలు ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడు. మృతుడి వయసు సుమారుగా 60 నుంచి 65 ఏళ్ల మధ్య ఉంటుందని, తెలుపు, నలుపు షర్ట్, పింక్, గులాబీ రంగుల లుంగీ ధరించి ఉన్నాడని రైల్వే జీఆర్పీ ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు.

ఒడిశాలో రోడ్డు ప్రమాదం

● గొండ్యాలపుట్టుగ యువకుడి మృతి


రమేష్(ఫైల్)

కవిటి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఒడిశాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కవిటి పంచాయతీ గొండ్యాలపుట్టుగ గ్రామానికి చెందిన బైరెడ్ల రమేష్(37) మంగళవారం రాత్రి మృతి చెందాడు. రమేష్ కంచిలి మండలం జలంత్రకోట వద్ద ఉన్న క్రషర్‌లో లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆరోగ్యం సరిగా లేక రెండు రోజులుగా ఇంటి వద్దే ఉన్నాడు. ఆరోగ్యం కుదుటపడడంతో రాయగడకు ఎక్స్‌కవేటర్‌ని తీసుకుని వెళ్లాడు. రాత్రి ఘాటి రోడ్డులో వెళుతున్న సమయంలో ఆకస్మాత్తుగా జరిగిన రోడ్డుప్రమాదంలో గాయపడ్డాడు. వెంటనే పర్లాకిమిడి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా అక్కడ మృతి చెందినట్టు కుటుంబసభ్యులకు సమాచారం అందింది. రమేష్‌కి భార్య మోహినితో పాటు ఐదేళ్లలోపు పిల్లలు ముగ్గురు ఉన్నారు. కుటుంబ పెద్ద మృతిచెందాడని తెలిసి కుటుంబ సభ్యులు ఆందోళనకు గురవుతున్నారు. రమేష్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

చెరువులో మహిళ మృతదేహం లభ్యం

సరుబుజ్జిలి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పురుషోత్తపురం గ్రామానికి చెందిన అంపోలు శకుంతల(40) గ్రామ సమీపంలోని చెరువులో బుధవారం శవమై తేలింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శకుంతల కన్నవారి గ్రామం నరసన్నపేట మండలం చోడవరం. చెరువులో మృతదేహం ఉన్నట్టు వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ బెండి హైమావతి సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. శకుంతలకు భర్త, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. శకుంతల తండ్రి కంచరాపు రమణారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. శకుంతల కొంతకాలంగా మానసికంగా బాధపడుతోంది. ఈ నేపథ్యంలో మనస్తాపం చెంది మృతి చెందినట్టు ఎస్ఐ తెలిపారు.

షాపులో చోరీ

పలాసరూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పలాస మండలం లక్ష్మీపురం జాతీయ రహదారి వంతెన సమీపంలో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. బాధితుల కథనం మేరకు వజ్రపుకొత్తూరు మండలం గల్లి గ్రామానికి చెందిన దుంపల హరీష్ మూడు నెలల కిందట షాపును ప్రారంభించారు. ఎప్పటిలాగే బేరం ముగిసిన తరువాత దుకాణం బంద్ చేసి వెళ్లిపోయాడు. తిరిగి వేకువజామున నాలుగు గంటల సమయంలో దుకాణం వద్దకు వచ్చి చూడగా తాళాలు పగలగొట్టి ఉండడాన్ని గుర్తించాడు. లోపలకు వెళ్లి చూడగా రూ.20వేలు నగదు, మూడు వేల విలువ చేసే సామగ్రి, రెండు సెట్ల సెల్‌ఫోన్, చెవి దుద్దులు అపహరించుకుపోయినట్టు తెలిపాడు. ఈ చోరీపై కాశీబుగ్గ పోలసులకు హరీష్ ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్యాస్‌లీకై ముగ్గురికి తీవ్ర గాయాలు

పొందూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): బురిడి కంచరాం గ్రామంలో బుధవారం గ్యాస్ లీకై మంటలు వ్యాపించడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. వండాన రామారావు ఇంటి వెనుక గదిలో గ్యాస్ లీక్ కాగా సాయంత్రం పొలం పనులు చేసుకుని వచ్చిన ఆయన తల్లి అప్పమ్మ గ్యాస్‌స్టవ్‌ను ముట్టించడంతో ఒక్కసారిగా ఇల్లంతా మంటలు వ్యాపించాయి. దీంతో అప్పమ్మకు చేతులు, ముఖం కాలిపోగా, అక్కడే ఉన్న మనవడు మౌలేష్‌కు రెండుకాళ్లు, చేతులు కాలిపోయాయి. మనవరాలు భవాని కూడా తీవ్రంగా గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం ఆటోలో శ్రీకాకుళంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

న్యాయం కావాలని కుమార్తెతో బైఠాయించిన మహిళ



ఇందిరాగాంధీ కూడలిలో నిరసన తెలుపుతున్న మహిళ

టెక్కలి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరాగాంధీ కూడలిలో బుధవారం టెక్కలి మేజర్ పంచాయతీ ఎన్టీఆర్ కాలనీకి చెందిన ఆర్.సంధ్య అనే మహిళ ఫ్లెక్సీ ఏర్పాటుచేసి తన ఎనిమిదేళ్ల కుమార్తె ఉషాకిరణ్‌తో కలిసి న్యాయం కావాలని బైఠాయించింది. తన భర్త కట్టిన ఇల్లును ఆడపడుచు దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని, అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన కరువైందని సంధ్య కన్నీరుమున్నీరుగా విలపించింది. తన భర్త పార్వతీశం కరోనా సమయంలో మృతిచెందారని, దీంతో తన ఇల్లును దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తనకు న్యాయం చేయాలని ఆమె కోరారు. అయితే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఈ ప్రాంతంలో వైసీపీ కార్యకర్తల ర్యాలీ ఉందని, వెళ్లిపోవాలని చెప్పడంతో ఆమె అక్కడ నుంచి వెనుదిరగాల్సి వచ్చింది. కాళ్లరిగేలా న్యాయం కోసం తిరుగుతున్నా అధికారులు స్పందించడం లేదని ఆమె వాపోయింది.

అస్వస్థతకు గురై గ్రానైట్ కార్మికుడి మృతి

టెక్కలి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రావివలస సమీపంలో ఓ గ్రానైట్ క్వారీలో కార్మికుడిగా పనిచేస్తున్న గేదెల ఎర్రయ్య(48) బుధవారం క్వారీలోనే అస్వస్థతకు గురయ్యాడు. ఈ మేరకు క్వారీ యంత్రాంగం ఎర్రయ్యను జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. యర్రయ్యది ఇదే మండలం పరశురాంపురం గ్రామం. ఈయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి కల్పించాలి

హరిపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల స్థాయిలో స్మార్ట్ కిచెన్లు ఏర్పాటు చేసి ఎండీఎం(మధ్యాహ్న భోజన పథకం) కార్మికుల పొట్టకొట్టవద్దని, వారికి ఉపాధి కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.కేశవరావు కోరారు. ఈ సందర్భంగా ఎండీఎం నిర్వాహకులతో కలసి బుధవారం ఎంఈవో ఎం.లక్ష్మణరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. సీఐటీయూ మండల కన్వీనర్ పి.దేవేంద్ర, ఎండీఎం కార్మికులు వరలక్ష్మి, స్వప్న, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య నూతన కార్యవర్గం

హిరమండలం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల మహిళా సమాఖ్య నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్ష పదవికి నలుగురు సభ్యులు పోటీపడ్డారు. సుభలయ గ్రామానికి చెందిన మహిళా సంఘం అధ్యక్షురాలు ఆర్.ప్రభావతి ఒక్క ఓటుతో గెలుపొందారు. అలాగే ఉపాధ్యక్షురాలిగా జి.భారతి, కోశాధికారిగా కె.జయలక్ష్మి, కార్యదర్శిగా కె.భాను, ఉప కార్యదర్శిగా బి.రూప్సీ ఎన్నికయ్యారు. ఏపీఎం సాయిలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎన్నికల్లో మండలంలోని పలు మహిళా సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

చేసిన అభివృద్ధి ప్రజలకు చూపిద్దాం

● ఎమ్మెల్యే గౌతు శిరీష



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పలాస నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు చూపిద్దామని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో శతశాతం టీడీపీ అభ్యర్థులు గెలుపొందేందుకు అంతా కలసి శ్రమిద్దామని ఎమ్మెల్యే గౌతు శిరీష పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో మండల, బూత్, క్లస్టర్, యూనిట్ కార్యవర్గంతో ప్రమాణస్వీకారం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదిక మీదుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా.. పెద్ద ఎత్తున పార్టీ నాయకుల, కార్యకర్తలు హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే శిరీష మాట్లాడుతూ.. గత వైసీపీ పాలనలో తనతో పాటు పార్టీ కార్యకర్తలు సైతం ఇబ్బంది పడ్డారని, అనేక మంది వారిపై చర్యలు తీసుకోరా అని ప్రశ్నిస్తున్నారని, అభివృద్ధి తప్పా అరాచకం వద్దని వారికి తెలియజేశామన్నారు. అలాగని తమ సహనాన్ని పరీక్షిస్తే మాత్రం ఉపేక్షించేది లేదన్నారు. పార్టీలో అంతా కలుపుకొని పనిచేయాలని, బాధ్యతగా పని చేసి ఎక్కడ సమస్య ఉంటే అక్కడే పరిష్కరించుకోవాలని సూచించారు. 2029 ఎన్నికల్లో గెలుపొందాలంటే ఇప్పటి నుంచి సంస్థాగతంగా కష్టించి పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వజ్జ బాబూరావు, పీరుకట్ల విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు యాదవ్, చౌదిరి నారాయణమూర్తి(బాబ్జీ), గొరకల వసంతరావు, దాసరి తాతారావు, ఎం.నరేంద్ర, దువ్వాడ శ్రీకాంత్, గురిటి సూర్యనారాయణ, సూరాడ మోహనరావు పాల్గొన్నారు.

చేసిన సేవలతోనే పార్టీలో గుర్తింపు

● ఎమ్మెల్యే మామిడి గోవిందరావు


ప్రమాణస్వీకరణలో పాల్గొన్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, పార్టీ పరిశీలకులు త్రినాథరావు

పాతపట్నం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పార్టీకి చేసినసేవలకు తగిన గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. స్థానిక కేఎస్ఎం ప్లాజాలో టీడీపీ మండల కమిటీ, బూత్, క్లస్టర్, యూనిట్ అనుబంధ కమిటీల ప్రమాణ స్వీకారోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ముందుగా పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా అవసరాలే సేవే లక్ష్యాలుగా పనిచేయాలని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా నాయకత్వంపై నిబద్ధత కలిగి ఉండాలన్నారు. నియోజకవర్గ పరిధిలోని బూత్, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జీలతోపాటు అనుబంధ శాఖలు, అలాగే పాతపట్నం మండల పార్టీ శాఖతోపాటు పాతపట్నం, కొత్తూరు, హిరమండలం పట్టణ కమిటీల ప్రమాణస్వీకారం నిర్వ హించారు. పార్టీ పరిశీలకులు డి.త్రినాథరావు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా రామలింగేశ్వరుని తెప్పోత్సవం



నరసన్నపేట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): దేశవాని పేట-పసారు వీధిలోగల రామలింగేశ్వర స్వామి తెప్పోత్సవంలో బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవ మూర్తులను తిరువీధి నిర్వహించి గడ్డెయ్యచెరువులో తెప్పోత్సవం చేపట్టారు. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, కూటమి నాయకులు పాల్గొని పూజలను నిర్వహించారు.

దుకాణాలకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

టెక్కలి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 31వ తేదీలోగా యజమానులు తమ దుకా ణాలను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ కె.దినేష్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో మైనింగ్, క్వారీలు, హోటల్స్, వర్తక సంఘ నాయకులు, సీఐటీయూ నాయకులతో సమావేశం నిర్వహించారు. పదిమందికి పైగా కార్మికులను నియమించుకున్న సంస్థకు ఈఎస్ఐ చట్టం వర్తిస్తుందన్నారు. ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, మైన్స్ ఏడీ విజయలక్ష్మి, ఏఎల్‌వో రాధాకుమారి, ఈఎస్ఐ ఏడీ శ్యామ్‌ప్రసాద్, శ్రీనివాస్, ప్రజ్ఞ, ఈశ్వరరావు, లాడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎండల మల్లన్నకు పూజలు


స్వామివారికి పూజలు చేస్తున్న కళింగ కార్పొరేషన్ చైర్మన్ కృష్ణంనాయుడు తదితరులు

టెక్కలి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రావివలసలో గల ఎండలమల్లికార్జునస్వామికి బుధవారం కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం తీర్థప్రసాదాలను అందించారు.

సందడిగా ఫ్రెషర్స్ డే


డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

పాతపట్నం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్ర భుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డేను బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ కె.చత్రపతి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదువుకోవాలన్నారు. విద్యార్థులు ఆట పాటలతో సందడి చేశారు. పీజీ వసతిగృహ వార్డెన్ రూన్సీ పాల్గొన్నారు.

పైపులైన్ పనులు ప్రారంభం

ఎల్ఎన్ పేట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉద్దానం ఫేజ్-2 పథకం ద్వారా మండలంలోని అన్ని గ్రామాలకు నాణ్యమైన ఫిల్టర్ వాటర్ అందించేందుకు పైపులైను పనులను బుధవారం నుంచి ప్రారంభించినట్టు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నిరంజన్ తెలిపారు. పాతపట్నం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని ప్రజలకు నీరందించేందుకు రూ265 కోట్లతో పైప్‌లైన్ పనులు జరుగుతున్నాయని తెలిపారు. త్వరలోనే పనులు పూర్తి చేయిస్తామన్నారు.

రేపు వాహనాల వేలం

టెక్కలి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ దాడుల్లో పట్టుబడిన మూడు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను ఈనెల 14న ఎక్సైజ్ కార్యాలయంలో మధ్యాహ్నం 3గంటలకు వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ షరీఫ్ తెలిపారు. వేలంపాటలో పాల్గొనేవారు రూ.వెయ్యి ధరావత్తు చెల్లించాలన్నారు. వివరాలకు ఎక్సైజ్ కార్యాలయానికి సంప్రదించాలని కోరారు.

కుక్క కడుపులో క్యాన్సర్ కణితి

పలాస, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం పెసరపాడు గ్రామానికి చెందిన బి.ప్రవీణ్ కుమార్‌కు చెందిన పమేరియన్ జాతికి చెందిన కుక్కకు శస్త్రచికిత్స చేసి అరకిలో బరువున్న క్యాన్సర్ కణితి తొలగించారు. పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ మట్ట రవికృష్ణ ఈ శస్త్ర చికిత్స చేశారు. 12 ఏళ్ల వయసున్న ఈ కుక్కకి ఆకలి, నిద్ర లేకపోవడంతో అనుమానం వచ్చి పశువైద్యులను సంప్రదించడంతో విషయం బయటపడింది. కుక్కకు క్యాన్సర్ కణితి తొలగించడం ఇదే మొదటిసారి.

త్రుటిలో తప్పిన ప్రమాదం



నందిగాం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రెల్లి వీధి సమీపంలో జాతీయ రహదారిపై త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది. ఒడిశా నుంచి విశాఖ వెళ్తు న్న కారు టైరు పేలడంతో డివైడర్‌ను ఢీకొని సర్వీస్‌రోడ్డు దాటి విద్యు త్ స్తంభాన్ని ఢీకొని మళ్లీ హైవేపై చేరుకుని నుజ్జునుజ్జయింది.

కొనసాగుతున్న రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు

పాతపట్నం నవంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక గిరిజన సామాజిక భవన ప్రాంగణంలో జరుగుతున్న అంతర్రాష్ట్ర సాఫ్ట్ టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీలు కొనసాగుతున్నాయి. బుధవారం జరిగిన పోటీలో ప్రతిభ చూపిన ఎన్.క్రిష్ధరన్ రెడ్డి(కృష్ణ జిల్లా), ఎస్‌కే తంజీల్(కృష్ణ), జి.లెహేశ్వర్(గుంటూరు), వి.మహిధర్ (విజయనగరం), ఎస్‌కే ఫాజల్ (గుంటూరు), కె.జయదేవ్(అనంతపూర్), ఎస్‌కే ఉస్మాన్(చిత్తూరు), పి.జయరాం(గుంటూరు) జాతీయస్థాయి పోటీలకు ఎంపి కైనట్లు నిర్వాహకులు ఎన్ని శేఖర్‌బాబు తెలిపారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి

పోలాకి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వసతి గృహాల్లో ఉంటున్న బాలికలంతా వ్యక్తిగత శుభ్రత పాటించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనాథ్ సూచించారు. బుధవారం ఆయన తన వైద్య సిబ్బందితో కలిసి గంగివలస కేజీబీవిని సందర్శించారు. బాలికలకు ఈవోపీఆర్‌డీ బి.పద్మావతి ఆరోగ్య జీవనంపై ప్రత్యేక సూచనలు చేశారు. ఎంపీడీఓ రవికుమార్, డిప్యూటీ ఎంపీడీవో పద్మావతి, కేజీబీవీ సంక్షేమాధికారిణి జి.శారద తదితరలు పాల్గొన్నారు.

కరవంజ ఆదర్శ పాఠశాల సందర్శన

జలుమూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కరవంజ మోడల్ స్కూల్‌ను పీఎంశ్రీ కేంద్ర బృందం బుధవారం పరిశీలించి తగు సూచనలు చేశారు. పాఠశాలకు విచ్చేసిన కేంద్ర బృందానికి పాఠశాల స్కౌట్ విద్యార్థులు సాదారంగా ఆహ్వానం పలికారు. పాఠశాలకు పీఎంశ్రీ పథకం ద్వారా అందుతున్న నిధులపై ఆరా తీశారు. బృందం రాజీందర్ కుమార్ వర్మ, విజయ్ చౌదరి, ఆనంద్ సింగ్, డీఈవో రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని ఎంచుకోవాలి

టెక్కలి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుకున్న సమయంలో ఓ లక్ష్యాన్ని ఎంచుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోవిందమ్మ అన్నారు. బుధవారం కళాశాలలో జరుగుతున్న ఫ్రెషర్స్ వేడుకల్లో విద్యార్థులు చదువుకున్న సమయంలో మొబైల్ వాడకం తగ్గించుకొని విలువైన కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలని, తద్వారా ఉన్నత శిఖరాలు అందుకోవా లన్నారు.

ఏమైందో?

(5వ పేజీ తరువాయి)

బిజీగా ఉన్న సమయంలో సృజన్ ఆత్మహత్యతో కలకలంరేగింది. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సృజన్ తండ్రి కృష్ణప్రసాద్ ఆటో డ్రైవర్ కాగా, తల్లి జ్యోతి గృహిణి. సృజన్‌కు సోదరి ఉంది. చేతికి అందివస్తాడనుకున్న కుమారుడు అర్ధాంతరంగా తనువు చాలించడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

కారణమేంటో?

సృజన్ మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తృతీయ సంవత్సరం చదువుతున్న ఈ విద్యార్థికి బ్లాక్‌లాగ్స్ ఉన్నాయి. ఫిల్మ్ మేకింగ్‌పై ఆసక్తి చూపేవాడని తోటి విద్యార్థులు చెబుతున్నారు. ఆత్మహత్యకు గల కారణాలపై పూర్తిస్థాయి పోలీసులు దర్యాప్తు చేస్తే వాస్తవాలు వెల్లడవుతాయి. విద్యార్థి ఆత్మహత్యకు ఒత్తిడి లేదా మరియేతర కారణం ఉందానన్న విషయం తేలాల్సి ఉంది. ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు క్యాంపస్‌ను సందర్శించారు. విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న గదిని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి వివరాలను ఆరా తీశారు. క్యాంపస్ డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ, ఏవో ముని రామకృష్ణ ఉన్నారు.

వరుసగా ఘటనలు..

శ్రీకాకుళం క్యాంపస్‌లో గతంలో కూడా ఇలాంటి సంఘటనలు జరిగాయి. మూడేళ్ల కిందట ఓ విద్యార్థిని ఫ్యాన్‌కు ఉరిపోసుకోగా, గతేడాది మరో విద్యార్థి హాస్టల్ భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇప్పుడు సృజన్ ఆత్మహత్యకు పాల్పడడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. విద్యార్థుల్లో ఒత్తిడిని తగ్గించి ఆత్మస్థైర్యం నింపేలా మానసిక నిపుణులతో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాల్సి ఉంది. విద్యార్థుల పర్యవేక్షణకు అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఒడిశా టు తమిళనాడు

(5వ పేజీ తరువాయి)

అందించేందుకు ఈ సరుకు కొనుగోలు చేశారు. ఒడిశా నుంచి గంజాయిని తీసుకొని వారు బస్సులో ఇచ్ఛాపురం పట్టణానికి చేరుకున్నారు. అక్కడ నుంచి నడుచుకుంటూ ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. సమాచారం అందుకున్న పట్టణ ఎస్ఐ ముకుందరావు సిబ్బందితో రైల్వే స్టేషన్‌కు చేరుకొని తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా కనిపించిన సతీష్‌కుమార్‌తో పాటు బాలుడి వద్ద ఉన్న బ్యాగులను తనిఖీ చేయగా గంజాయి మూటలు బయటపడ్డాయి. సతీష్‌ను అరెస్టు చేసి ఇచ్ఛాపురం మేజిస్ట్రేట్ వద్ద హాజరుపరిచారు. బాలుడిని శ్రీకాకుళం జేజేబీ బోర్డు వద్ద హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు.

గంజాయి కేసులో ఇద్దరికి పదేళ్ల జైలు

శ్రీకాకుళం క్రైం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన ఇద్దరికి శ్రీకాకుళం మొదటి అదనపు జిల్లా సెషన్స్ (ఎన్‌డీపీఎస్) కోర్టు న్యాయాధికారి పి.భాస్కరరావు పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్టు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆ వివరాలిలా ఉన్నాయి.. 2017 నవంబరు 17న చిలకపాలెం టోల్‌గేట్ వద్ద ఎచ్చెర్ల పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా రెండు కార్లలో ఇద్దరు వ్యక్తులు గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డారు. విశాఖ జిల్లా అటవీ ప్రాంతంలో గంజాయి కొనుగోలు చేసి ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌కు తరలిస్తూ పట్టుబడ్డారు. రెండు కార్లలో రూ.18 లక్షల విలువైన 200 కేజీల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు విచారణ అనంతరం నిందితులకు జైలు, జరిమానా విధించినట్టు ఎస్పీ తెలిపారు. మాదక ద్రవ్యాల రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు చేపడుతున్నట్టు పేర్కొన్నారు.

విద్యార్థికి స్క్రబ్ టైఫస్ వ్యాధి

కొత్తూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కడుము వసతి గృహంలో 8వ తరగతి చదువుతున్న జి.ఈశ్వర్ స్క్రబ్ టైఫస్ వ్యాధి సోకిందని కేజీహెచ్ వైద్యులు నిర్ధారించారని కురిగాం ఆసుపత్రి వైద్యాధికారి పెద్దిన ప్రసన్నకుమార్ తెలిపారు. బుధవారం కడుము వసతి గృహాన్ని ఎంపీడీవో వి.నీరజతో పాటు వైద్య బృందం చేరుకొని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇటీవల అస్వస్తతకు గురైన ఈశ్వర్‌ను చికిత్సకోసం కేజీహెచ్‌కు తరలించడంతో విషయం బయటపడింది. దీంతో కేజీహెచ్ వైద్యులు సలహామేరకు వసతి గృహం పరిసరాలను శానిటేషన్ చేయించినట్టు తెలిపారు. ఇతర విద్యార్థులు అస్వస్తతకు గురికాకుండా ఉండేలా వార్డెన్‌కు పలు సూచనలను చేసినట్టు తెలిపారు. ఈ వ్యాధి సోకినవారు జిల్లాలో నాలుగురు ఉన్నట్టు ఉన్నత అధికారులు గుర్తించారన్నారు. ఈ వ్యాధి గాలిద్వారా వ్యాప్తి చెందదని, వ్యాధికి గురైన వారి శరీరంపై పుండ్లు ఉంటే అవి చిదిగడం ద్వారా ఇతరులకు అంటుకునే ప్రమాదం ఉందన్నారు.

బాలికపై లైంగిక దాడి కేసులో వృద్ధుడి అరెస్టు

నరసన్నపేట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) పట్టణంలో ఓ కాలనీలో గత ఆదివారం ఒక బాలికపై లైంగిక దాడికి పాల్పడిన డబ్బై ఏళ్ల వృద్ధుడు చల్ల రామమూర్తిని బుధవారం అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టినట్టు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. వృద్ధుడినిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు చెప్పారు. నరసన్నపేట కోర్టు న్యాయాధికారి రిమాండ్ విధించినట్టు తెలిపారు.

తూతూ మంత్రంగా సమావేశం

పాతపట్నం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ దొర సావిత్రమ్మ అధ్యక్షతన బుధవారం జరిగిన మండల సాధారణ సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా జరిగింది. ఒకవైపు టీడీపీ నాయకుల ప్రమాణ స్వీకారోత్సవాలు మరో వైపు వైసీపీ నాయకుల నిరసన ర్యాలీ నేపథ్యంలో సమావేశాన్ని మమ అనిపించేశారు. సమావేశంలో ఎంపీడీవో రమణమూర్తి, ఏవో సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఆరుతడి పంటలు వేసుకోవాలి

కోటబొమ్మాళి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో వరి పంటకు బదులుగా చోడి, మొక్కజొన్న వంటి తదితర ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని టెక్కలి వ్యవసాయ సహాయ సంచాలకులు కె.జగన్మోహన రావు అన్నారు. బుధవారం ఎత్తురాళ్లపాడులో ఏవో ఎస్.గోవిందరావు ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. టీడీపీ నాయకులు కోట సంతోష్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

పలాస రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పలాస నియోజకవర్గ పరిధిలో సీఎంఆర్ఎఫ్ నుంచి వైద్య ఖర్చుల కోసం మంజూరైన చెక్కులను బుధవారం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఎమ్మెల్యే గౌతు శిరీష బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. మొత్తం 12 మందికి రూ.10.85 లక్షలు అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీడీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, టీడీపీ నాయకులు పీరికట్ల విఠల్ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా పరీక్షలు నిర్వహించాలి

వజ్రపుకొత్తూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రానున్న ఇంటర్ పబ్లిక్ పరీక్షలను పగడ్బందీగా నిర్వహించాని జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి (డీవీఈవో) సురేష్ కుమార్ అన్నారు. బుధవారం పూండి గోవిందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలను తరగతి గదులు, మౌలిక సదుపాయాలను పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులకు ప్రయోగాలపై అవగాహన కల్పించాల న్నారు. ఇంటర్ బోర్డు ప్రకారం తరగతులు, స్టడీ అవర్స్ పూర్తి స్థాయిలో నిర్వహించాలని అన్నారు. ప్రిన్సిపాల్స్ బీమేశ్వరరావు, రమేష్ పట్నాయక్ తదితరులు ఉన్నారు.

కొత్తూరు ఎస్ఐగా వెంకటేష్


ఎస్ఐ వెంకటేష్

కొత్తూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కొత్తూరు ఎస్ఐగా కె.వెంకటేష్ బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈయన హిరమండలం నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన అమీర్ అలీ ఇటీవల బదిలీపై వెళ్లారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయం తగదు


పోలీసులతో వాదిస్తున్న మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం అర్బన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీ కరణ నిర్ణయం దారుణమని, దీనవల్ల సామాన్యులకు వైద్యం అందే అవకాశం లేదని మాజీ మంత్రి, వైసీపీ నేత ధర్మాన ప్రసాదరావు అన్నారు. పార్టీ ఆదేశాల మేరకు బుధవారం నగరంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో పోలీసులు ధర్మానను అడ్డుకోవడంతో పోలీసులకు, వైసీపీ నేతలకు మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన వైద్య కళాశాలలను ఆ కళాశాలకు అనుబంధంగా పనిచేస్తున్న జిల్లా ఆసుపత్రులను బరితెగించి ప్రైవేటీకరణ చేస్తుందని విమర్శించారు. కార్య క్రమంలో మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, పార్లమెంట్ పరిశీలకుడు కుంభ రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

● కాశీబుగ్గ: ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణ ఆపాలని వైసీపీ నేత, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు డిమాండ్ చేశారు. ప్రభుత్వ విధానాన్ని నిరసిస్తూ బుధవారం పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీకి అనుమతి లేకపోవడంతో పోలీసులు అడ్డుకునగా.. స్వల్ప వాగ్వాదం చోటు చేసుకుంది. అనంతరం పలాస ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు.

● ఎచ్చెర్ల: వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయొద్దని మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నియోజకర్గ ఇన్‌చార్జి గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. బుధవారం ఎచ్చెర్ల పాత జాతీయ రహదారి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, డీటీ బాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు.

● నరసన్నపేట: ప్రభుత్వ విధానాన్ని నిరసిస్తూ వైసీపీ నాయకులు బుధవారం పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేవరకు పోరాటం చేస్తామని డిప్యూటీ మాజీ సీఎం, వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి వినత పత్రంను అందజేశారు.

● టెక్కలి: ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైసీపీ ఆధ్వర్యంలో బుధవారం టెక్కలిలో ర్యాలీ నిర్వహించారు. నియోజవకర్గ పరిశీలకులు శ్యామ్‌ప్రసాద్ రెడ్డి, ఇన్‌చార్జి పేడాడ తిలక్ ఆధ్వర్యంలో కార్యకర్తలు ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని వినతి పత్రం అందజేశారు.

● పాతపట్నం: నియోజకవర్గ వైసీపీ పరిశీలకులు పాలవలస విక్రాంత్ ఆధ్వర్యంలో ఆపార్టీ నేతలు మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను నిరసిస్తూ ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని డీటీకి వినతి పత్రం అందజేశారు. పట్టణ ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు.